అపొ. పౌలు ప్రకటించెను (రోమా 1:16).

దేవుడు నిజముగా శక్తిగల దేవుడు. ఆయన సృజించిన ఈ విశ్వమంతటిలో ఆయన శక్తి బయలుపరచబడి యున్నది (రోమా 1:20). ఆయన యేసుక్రీస్తును మృతులలో నుండి లేపినప్పుడు ఆయన శక్తి బయలుపరచబడి యున్నది (ఎఫెసీ 1:19). ఎఫెసులో యున్న ప్రజలను పాపపు మరణము నుండి క్రీస్తులోని జీవమునకు మార్చుటద్వారా ఆయనశక్తి బయలు పరచబడి యున్నది (ఎఫెసీ 2:1-3).

సువార్తలో యున్న దేవుని శక్తిని గూర్చి మనమాలోచించునప్పుడు, ఒక తీవ్రమైన ప్రశ్న మనకు రావచ్చును. అదేమంటే సువార్త రక్షించుటకు దేవుని శక్తి అయిన యెడల అనేకులు ఎందువలన నశించుచున్నారు? దేవుడు సర్వశక్తిగల దేవుడయిన యెడల, నశించిన వారిని రక్షించుటకు సువార్త ఆయన శక్తి అయిన యెడల, సువార్త యొక్క ప్రభావము ఎందువలన పెక్కుమందిలో కనబడుటలేదు? ఈ సమస్యను మరింత క్లిష్టముగా చేయుటకు యేసు మానవుల నిత్యగమ్యములను గూర్చి చెప్పిన సంగతిని ఇక్కడ ఒకసారి ఆలోచించుదము. ఆయన ఇట్లనెను: "ఇరుకు ద్వారమున ప్రవేశించుడి. నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆదారి విశాలమునై యున్నది, దానిద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకుపోవు ద్వారము ఇరుకును, ఆదారి సంకుచితమునూ యున్నది. దానిని కనుగొనువారు కొందరే" (మత్తయి 7:13,14). యేసు చెప్పిన ఈ మాటలను బట్టి రక్షింపబడు వారి కంటే నశించుపోవారు ఎక్కువ యుందురు. ఇరుకు ద్వారమును కనుగొనిన దాని సంకుచితమైన మార్గములో ప్రయాణించువారు కొందరే. అయితే నాశనమునకు పోవు దారిలో ప్రవేశించువారు అనేకులు.

అయితే ఇప్పుడొక ప్రశ్న: దేవుడు శక్తిగల దేవుడైన యెడల, మానవులను పాపము నుండి



రక్షించుటకు సువార్త ఆయన శక్తి అయిన యెడల, లోకములో యున్న వారందరు ఎందువలన రక్షింపబడుటలేదు? మానవులు ఎట్లు నశించి పోగలరు? ఈ గడ్డు ప్రశ్నకు అపొ. పౌలు జవాబిచ్చుచున్నారు. నమ్ము ప్రతి వానిని రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నదని అతడు చెప్పుచున్నాడు. "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి తరువాత హెల్లేనీయునికి కూడ రక్షణ కలుగుజేయుటకు అది దేవుని శక్తియై యున్నది" (రోమా 1:16). కొరింథులో యున్న క్రైస్తవులు సువార్తను విశ్వసించినందు వలన వారు రక్షింపబడిరని ఈ గొప్ప బోధకుడు వారికి జ్ఞాపకము చేసెను (1కొరింధి 15:1-3).

పాపపుశక్తి నుండి, దాని దుష్ఫలితముల నుండి కలుగు విడుదల లేక రక్షణ షరతులపై ఆధారపడియున్నది. రక్షణ గనుక షరతులు లేనిదైతే, అంటే మానవుడేమియు చేయకుండగనే దేవుడు మానవులను రక్షించిన యెడల, అప్పుడు మానవులందరు రక్షింపబడుదురు అనే భావాన్ని అంగీకరించ వీలగను. అట్టి సందర్భములో కూడ అందరు రక్షింపబడని యెడల దేవుడు సర్వశక్తిమంతుడా? యని మనము ప్రశ్నించవచ్చును. మన ప్రాముఖ్య ప్రశ్నకు జవాబును ఇప్పుడు మనమియ్యగలము : సువార్త వలన అందరు ఎందుకు రక్షింపబడుటలేదు? దీనికి జవాబేమంటే అందరు సువార్తను నమ్ముటలేదు! ఎవరైతే సువార్తను నమ్ముదురో వారినే రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నది. గనుక ఎవడైతే సువార్తను నమ్మడో లేక విశ్వసించడో వాడు రక్షింపబడడు. ఆవిశ్వాసము దేవుని శక్తిని నిరర్ధకము చేయును.

అందరు సువార్తను నమ్ముటలేదు గనుక సువార్త అందరినీ రక్షించుట లేదు అన్నప్పుడు వారెందుకు నమ్ముటలేదు? అనే ప్రశ్న మనకు రావచ్చును. సువార్త రక్షించుటకు దేవుని శక్తి అయిన యెడల ప్రతివాడు ఆ వర్తమానమును ఎందుకు

నమ్మలేదు? మనుష్యుని యొక్క గర్వము ఒక ప్రాముఖ్య కారణమని మనము చెప్పుకొనవచ్చును. రక్షించుటకు సువార్త దేవుని శక్తియని ప్రకటించిన అపొస్తలుడే, ఆ సువార్తను విశ్వసించని ప్రజలనుకూడ కొందరని ఎదుర్కొనెను. ఉదాహరణకు గ్రీసుదేశపు వాణిజ్య కేంద్రమైన కొరింధులో పౌలు సువార్తను ప్రకటించెను. "మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియపరచుచున్నారు. మీరు దానిని అంగీకరించితిరి, దానియందే నిలిచియున్నారు. మీ విశ్వాసము వ్యర్థమైతేనే గాని, నేను ఏ ఉపదేశరూపముగా సువార్త మీకు ప్రకటించితినో, ఆ ఉపదేశమును మీరు గట్టిగా పట్టుకొని యున్న యెడల ఆ సువార్త వలననే మీరు రక్షణ పొందువారై యుందురు" (1 కొరింధీ 15:1,2). అయితే ఈ రక్షణవార్తను పౌలు కొరింధులో ప్రకటించినప్పుడు దానిని నమ్ముటకు నిరాకరించినవారు లేకపోలేదు. నిజానికి ఏదయితే కొందరికి రక్షనవార్తగా యుండెనో మరి కొందరికి అది వెర్రితనముగా కనబడెను. గనుక తన సువార్త ప్రకటనను గూర్చి పౌలు కొరింధీయులకు వ్రాసిన మొదటి పత్రిక, మొదటి అధ్యాయములో ఇట్లు వ్రాసెను. "సిలువను గూర్చిన వార్త, నశించుచున్న వారికి వెర్రితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి" (18వ). "అయితే మేము సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము. ఆయన యూదులకు ఆటంకముగాను, అన్యజనులకు వెర్రితనము గాను ఉన్నాడు" అని 23, 24 వచనములలో అతడు వ్రాసెను. పౌలు నాటి ప్రజల వలె ఈనాటి ప్రజలును ఈలోక జ్ఞానము చేతను తత్వజ్ఞానము చేతను తమ హృదయములను నింపుకొనిన వారై సువార్త యొక్క శక్తిని తిరస్కరించుచున్నారు. కొరింధులో మరికొంత మంది ఇంకొక కారణము వలన సువార్తను నమ్ముటకు నిరాకరించిరి. వారికొక సూచకక్రియ అవుసరమాయెను. అందుకే యూదులు సూచకక్రియలు చేయమని అడుగు చున్నారు,



గ్రీసు దేశస్థులు జ్ఞానము వెదుకుచున్నారు" అని 32వ వచనములో అతడు వ్రాసెను.

సూచకక్రియలను వెదకువారు, సువార్తను నమ్మక అద్భుతములను వెదకుచున్నారు. అద్భుతముల ద్వారా దేవుని శక్తిని తెలిసికొనవలెనని కోరువాడు కాని ప్రదేశములో దానిని వెదుకుచున్నాడు. సూచకక్రియలను వెదకువాడు ఒక ప్రత్యేక కలకొరకు గాని, లేదా దర్శనము కొరకు గాని, లేదా దేవుని స్వరమును వినుటకు గాని ఇంకను కనిపెట్టుచున్నాడు. పరిశుద్ధాత్ముడు అద్భుతరీతిగా వచ్చి తనను తన పాపములనుగూర్చి ఒప్పింజేయవలెనని అతడు కోరుచున్నాడు. రక్షణను గూర్చి ఇట్టి భావములను అనేకులు ఇంకను కలిగి యుండుట విచారకరము. కొందరు బోధకులు ఇట్టి విధమైన వర్తమానములనందించుట ద్వారా ఈ సమస్య మరింత క్లిష్టముగా తయారైనది. ఆకాశములో సూచకక్రియలను గూర్చి వెదుకుటకంటే మానవులు లేఖనములో రక్షకుని వెదుకుట మంచిది. లేఖనములయందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుడి యని యేసు బోధించెను (యోహాను 5:39).

పాపపు ఉనికిని గూర్చి ఒకడు తెలిసికొన వలెనంటే రోమా 3:23లో పరిశుద్ధాత్ముడు చెప్పిన దానిని అతడు అంగీకరించవలెను : "ఏ బేధమును లేదు, అందరు పాపము చేసి దేవదను గ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు". ప్రతివాడు రక్షింపబడవలెనని దేవుడు కోరుచున్నట్లు ఒకడు తెలిసికొన వలెనంటే అతడు 1తిమో 2:4ను అంగీకరించవలెను: "ఆయన మనుష్యులందరు రక్షణ పొంది సత్యమును గూర్చిన అనుభవజ్ఞానము గలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు".లేదా 2 పేతురు 3:9 చెప్పుచున్న దానిని అంగీకరించవలెను : "ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాదుగాని యెవడును నశింపవలెనని యిచ్ఛ యింపక

